కేజీబీవీల్లో ఏఎన్ఎం, అకౌంటెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు

షాబాద్, అక్టోబర్ 21: రంగారెడ్డి జిల్లాలోని కేజీబీవీల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఏఎన్ఎం, అకౌంటెంట్‌గా పని చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో సుశీందర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏఎన్ఎం పోస్టులు-2, అకౌంటెంట్ పోస్టులు-5 ఖాళీ గా ఉన్నాయన్నారు. ఏఎన్ఎంకు ఇంటర్ సర్టిఫికెట్‌తో పాటు ఏఎన్ఎం శిక్షణ తీసుకున్న ధ్రువపత్రం ఉండాలన్నారు. అకౌంటెంట్‌కు గ్రాడ్యుయేట్, బేసిక్ కంప్యూటర్ స్కిల్స్/బీ-కామ్ సర్టిఫికెట్ ఉండాలని.. 01-07-2024 నాటికి 18-44 ఏండ్లలో పు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేండ్లు, దివ్యాంగులకు పదేండ్ల సడలింపు ఉంటుందన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో లభించే దరఖాస్తు ఫారాన్ని నింపి దానికి అర్హత గల సర్టిఫికెట్లు (అటెస్టెడ్ కాపీలు)జతపరచి కలెక్టరేట్(IDOC)లోని డీఈవో కార్యాలయం, రెండోఅంతస్తు(S-27)నందు 25-10-2024 -01-11-2024 వరకు ఉదయం 10:30నుంచి సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు అందజేయాలన్నారు.

ఐటీఐ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ..

వికారాబాద్, అక్టోబర్ 21 : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కోర్సుల్లో ఏడో విడతలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వికారాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్రబాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30న ఉదయం 11 గంటల వరకు అవకాశం ఉందన్నారు. (ఇంతకు ముందు దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయొద్దు) కొన్ని కోర్సులకు మాత్రమే ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. 1-08-2024 నాటికి 14 ఏండ్లు నిండిన విద్యార్థినీవిద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్‌సైట్లో http://iti.telangana.gov.in. అప్‌లోడ్ చేయాలన్నారు. మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని.. ఇతర వివరాలకు 91774 72488, 85558 65421, 91779 54208 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

బ్యాంకింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

వికారాబాద్, అక్టోబర్ 21: బ్యాంకింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల గడువును పొడిగిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ Banking /IBPS (POs & Clerks) పరీక్షల కోసం వికారాబాద్ జిల్లాకు చెందిన అర్హులైన ST/ SC/BC అభ్యర్థులకు 60 రోజులపాటు ఉచితంగా కోచింగ్ ఇస్తుందన్నారు. అభ్యర్థులు studycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అప్లికేషన్ల గడువును 27.10.2024 వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. అభ్యర్థుల వార్షికాదాయం రూ.3 లక్షలకు మించరాదని.. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణలో నెలవారీ స్టైఫండ్, స్టడీ మెటీరియల్, లాంగ్ నోట్స్ బుక్స్ వంటివి ఉచితంగా అందిస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం 040-27540104 ని ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలన్నారు.

శశికళ కు పురస్కారం

ఏపీలోని తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతరలో పాల్గొని గాయకురాలిగా సత్తాచాటిన మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్, ప్రముఖ జానపద గాయకురాలు మద్దెల శశికళకు జాతీయ పురస్కారం లభించింది. ఐఎస్‌వో గుర్తింపు పొందిన కళావేదిక సీఈవో ప్రతాప్, అంతర్జాతీయ కన్వీనర్ రమావతిదేవి, జాతీయ కన్వీనర్ భూషణం ఆమెకు సోమవారం ఆ పురస్కారాన్ని అందించి ఘనంగా సన్మానించారు.

-యాచారం, అక్టోబర్ 21

చైన్‌మెన్లకు స్థాన చలనం

సిటీబ్యూరో, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ) : ఏండ్ల తరబడి ఒకే సర్కిల్‌లో పాతుకుపోయిన పట్టణ ప్రణాళికా విభాగం చైన్‌మెన్లకు ఎట్టకేలకు స్థానచలనం కలిగింది. మాదాపూర్ కావూరిహిల్స్ ఫేస్-2 రోడ్డులోని దాదాపు 1000 గజాల స్థలంలో ఓ వ్యాపారి సెకండ్ హ్యాండ్ కార్ సేల్స్‌కోసం అక్రమంగా షెడ్డు వేసుకోగా..ఆ వ్యాపారి నుంచి భారీగా ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలు.. జోన్‌లో మిగతా చైన్‌మెన్లు అక్రమ నిర్మాణాల నుంచి అందినంద దండుకుంటున్నారన్న ఫిర్యాదులొచ్చిన నేపథ్యంలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి చర్యలకు ఉపక్రమించారు. కావూరిహిల్స్ ఫేస్-2లోని దాదాపు 1000 గజాల స్థలంలో ఏర్పాటు చేసిన షెడ్డు, కూల్చివేతల్లో జరిగిన వ్యవహారంపై డీసీ, ఏసీపీలతో విచారణ జరిపించిన జడ్పీ సమూల ప్రక్షాళన చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జోన్‌లోని సర్కిళ్లలో పట్టణ ప్రణాళికా విభాగంలో పనిచేస్తున్న చైన్‌మెన్లను బదిలీచేస్తూ జోనల్ అధికారులు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఇందులో శేరిలింగంపల్లి సర్కిల్‌లో పనిచేస్తున్న లక్ష్మీనారాయణను యూసుఫ్‌గూడ సర్కిల్‌కు, జావీద్‌ను చందానగర్ సర్కిల్‌కు, చందానగర్ సర్కిల్‌లో పని చేస్తున్న ఐలయ్య, కుమారస్వామిని పటాన్‌చెరు సర్కిల్‌కు, పటాన్‌చెరు సర్కిల్‌లో పనిచేస్తున్న మల్లేశ్‌ను శేరిలింగంపల్లి సర్కిల్‌కు, రాజేందర్‌ను చందానగర్ సర్కిల్‌కు బదిలీ చేశారు. చందానగర్ సర్కిల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే ప్రవీణ్‌కుమార్(గడ్డంశ్రీను) పటాన్‌చెరు సర్కిల్‌కు బదిలీ కాగా.. వారిని తక్షణమే రిలీవ్ చేయాలని జోనల్ కమిషనర్ ఆదేశించారు. కాగా, సోమవారం సాయంత్రం కొందరు చైన్‌మెన్లు ఆయా స్థానాల్లో కేటాయించిన కొత్త సర్కిళ్లలో రిపోర్టు చేశారు. కాగా కావూరిహిల్స్ ఫేస్-2 రోడ్డులో దాదాపు 1000 గజాల స్థలంలో అనుమతి లేకుండా షెడ్డు నిర్మాణం జరుగుతున్నట్లు విచారణ అధికారులు తేల్చగా.. సదరు నిర్మాణదారుడికి టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులు అందుకున్న సదరు యజమాని సోమవారం కూడా పనులు జరిపినట్లు సమాచారం.

అర్జీలను పరిష్కరించాలి

- ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబర్ 21 : ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఆయన స్వయంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణికి 114 దరఖాస్తులు రాగా.. అందులో భూసమస్యలు, రైతు రుణమాఫీ తదితర సమస్యలకు సంబంధించి దరఖాస్తులు ఉన్నాయన్నారు. స్వీకరించిన వాటిలో కొన్నింటిని అక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని శాఖల వారీగా అధికారులకు పంపించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లాలో 84 ఫిర్యాదులు..

రంగారెడ్డి, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించా రు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో ఆమె ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 17 దరఖాస్తులు, జిల్లా విద్యాశాఖకు సంబంధించి 6, రెవెన్యూ శాఖకు సంబంధించి 52, పంచాయతీ శాఖకు సంబంధించి 4, మున్సిపల్ శాఖకు సంబంధించి 4, జీహెచ్ఎంసికి సంబంధించి ఒక్క దరఖాస్తు కలిపి మొత్తం 84 దరఖాస్తులొచ్చాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జోగిన్‌పల్లి భాస్కరరావు ఇంజినీరింగ్ కళాశాలలోని కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు

ఇబ్రహీంపట్నం : కాలికి గాయంతో ఉన్న అభ్యర్థిని కుర్చీలో కూర్చోబెట్టుకుని తీసుకెళ్తున్న పోలీసులు

సజావుగా గ్రూప్-1 మొదటి పరీక్ష

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- పోలీసుల వలయంలో పరీక్షా కేంద్రాలు
- 12:30 నుంచి 1:30 వరకు కేంద్రాల్లోకి అనుమతి
- కేజీరెడ్డి కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి.. వెనక్కి పంపించిన అధికారులు

కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల వద్ద హాల్ నంబర్ చెక్ చేసుకుంటున్న అభ్యర్థులు

మొయినాబాద్, అక్టోబర్ 21 : గ్రూప్-1 మెయిన్స్ మొదటి పరీక్ష సజావుగా సాగింది. టీజీపీఎస్‌సీ ఆదేశాల మేరకు అధికారులు పకడ్బందీగా ఏర్పాటు చేశారు. మండలంలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలో గల విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటైన కేంద్రంలో 984 అభ్యర్థులకు గాను 627 మంది పరీక్ష రాయగా 357 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా అమ్డాపూర్ చౌరస్తాలోని జోగిన్‌పల్లి ఇంజినీరింగ్ కళాశాలలో 816 మంది అభ్యర్థులకుగాను 500 మంది హాజరు కాగా 316 మంది రాయలేదు. చిలుకూరు రెవెన్యూలోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 1200 అభ్యర్థులకుగాను 768 మంది పరీక్ష రాయగా 432 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థులను మధ్యాహ్నం 12:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల మధ్యలో పంపించారు. 1:30 గంటల తర్వాత పరీక్షా కేంద్రాల గేట్లను మూసేశారు. రెండు నిముషాలు ఆలస్యం వచ్చిన అభ్యర్థులను కూడా లోపలికి అనుమతించలేదు. కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు వినోద్ అనే అభ్యర్థి 17 నిమిషాలు ఆలస్యంగా రావడంతో పరీక్షా కేంద్రంలోకి అధికారులు అనుమతించలేదు.

కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ శశాంక

గ్రూప్-1 పరీక్షా కేంద్రాలను రంగారెడ్డి కలెక్టర్ శశాంక సందర్శించి పరిశీలించారు. విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలోని కేంద్రాన్ని పరీక్ష ప్రారంభం కాక ముందే పరిశీలించారు. జోగిన్‌పల్లి భాస్కరరావు ఇంజినీరింగ్ కళాశాలలోని కేంద్రాన్ని అభ్యర్థులు పరీక్ష రాస్తుండగా వెళ్లి పరిశీలించారు. టీజీపీఎస్‌సీ ఆదేశానుసారం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. సమయం ప్రకారం వచ్చిన అభ్యర్థులను మాత్రమే కేంద్రాల్లోకి అనుమతించాలని, ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించొద్దన్నారు. కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె తోపాటు మొయినాబాద్, చేవెళ్ల తహసీల్దార్లు గౌతమ్ కుమార్, కృష్ణ, సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి వినోద్.. అధికారులు అనుమతించకపోవడంతో తిరిగి ఇంటికెళ్తూ..

మొయినాబాద్ : కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వద్ద భద్రత గురించి పోలీసులతో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు.. నో ఎంట్రీ

గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద అభ్యర్థులు

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆరు గ్రూప్-1 పరీక్షా కేంద్రాల్లో సోమవారం మొదటి రోజు పరీక్ష సజావుగా సాగింది. కేంద్రాల వద్ద ముందు జాగ్రత్తగా అధికారులు 144 సెక్షన్ విధించారు. ప్రతి కేంద్రం వద్ద సీఐతోపాటు పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఇబ్రహీంపట్నం సమీపంలోని శ్రీఇందు ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలను పరిశీలించి వసతులను అడిగి తెలుసుకున్నారు. మొదటి పరీక్షా కేంద్రానికి 600 మంది అభ్యర్థులకుగాను 515 మంది హాజరు కాగా 85 మంది గైర్హాజరయ్యారు. రెండో కేంద్రంలో 720 అభ్యర్థులకు 589 మంది హాజరు కాగా 131 మంది పరీక్ష రాయలేదు. సీవీఆర్ కళాశాలలో 787 మంది అభ్యర్థులకు 489 మంది హాజరు కాగా 298 మంది గైర్హాజరయ్యారు.

గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి కేంద్రంలో 504 మంది అభ్యర్థులకు 404 మంది పరీక్ష రాయగా 100 మంది, రెండో కేంద్రంలో 504 అభ్యర్థులకుగాను 411 మంది హాజరు కాగా 83 మంది గైర్హాజరయ్యారు. శ్రీదత్త ఇంజినీరింగ్ కళాశాలలో 912 మంది అభ్యర్థులకుగాను 753 మంది హాజరుకాగా 159 మంది పరీక్ష రాయలేదు. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఆ కేంద్రాలన్నింటినీ అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందు లు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కాగా పరీక్షా కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన ముగ్గురిని అధికారులు లోపలికి అనుమతించలేదు. గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలకు ఆలస్యంగా వచ్చిన అఖిల, వినీత్, శ్రీదత్త కళాశాలకు ఆలస్యంగా వచ్చిన మరో అభ్యర్థిని కూడా అధికారులు కేంద్రాల్లోకి అనుమతించలేదు.

పోలీసుల వలయంలో పరీక్షా కేంద్రాలు

గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి ఆదేశానుసారం రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ భారీ బందోబస్తు నిర్వహించారు. డీసీపీ పర్యవేక్షణలో మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సివిల్ పోలీసులతోపాటు ఎస్‌వోటీ, ఎస్‌బీ, సీఆర్‌పీఎఫ్, పారామిలిటరీ బలగాలు పరీక్షా కేంద్రాల వద్ద తనిఖీలు నిర్వహించారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ అన్ని కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

స్వీప్ కార్యక్రమాలను పక్కాగా చేపట్టాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 21 : జిల్లాలో ఓటరు జాబితా సవరణ 2024-25 కోసం స్వీప్ కార్యక్రమాలను పక్కాగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి గ్రాడ్యుయేట్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు రూపకల్పనపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఇందులో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారి మాట్లాడుతూ.. పెండింగ్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు నమోదు దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, అర్హులైన ఓటర్లు తమ పేర్లను ఓటరు జాబితాలో నవంబర్ 6 లోపు నమోదు చేయించుకోవాలన్నారు. ఓటరు జాబితా సవరణ 2024-25 కోసం స్వీప్ కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలని, ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలన్నారు. 1 జనవరి 2025 నాటికి 18 ఏండ్లు నిండే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించాలన్నారు. అక్టోబర్ 29న డ్రాఫ్ట్ ఓటరు జాబితా రిలీజ్ అవుతుందని.. దీనిపై అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు దరఖాస్తులను నవంబర్ 29 వరకు స్వీకరిస్తామన్నారు. డిసెంబర్ 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటరు జాబితాను ప్రచురించాలన్నారు. సమావేశంలో వాసుచంద్ర , ఉద్యానవన శాఖ అధికారి సత్తార్, ఎన్నికల విభాగం సుపరింటెండెంట్ నహమాత్ హలి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పును మాత్రమే వాడాలి

వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్

ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినం సందర్భంగా వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్

వికారాబాద్, అక్టోబర్ 21 : అయోడిన్ ఉప్పును మాత్రమే వాడాలని, ఉప్పుతో కూడిన ఆహార పదార్థాలను అధికంగా వాడితే అనర్థాలు కలుగుతాయని వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినం సందర్భంగా వికారాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఐదు గ్రాముల కన్నా ఎక్కువ ఉప్పు తీసుకోవద్దని .. పోషకాహారం, తాజాపండ్లు, కూరగాయలు, ఆకుకూరలు అన్నింటినీ సమపాళ్లలో తీసుకోవాలన్నారు. అంతేకాకుండా ప్రతిరోజూ వ్యాయామం చేయాలని.. కొవ్వు తక్కువగా ఉండే పదార్థాలను తినాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉపకేంద్రం, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అయోడిన్ ఉప్పు వల్ల కలిగి లాభనష్టాలను వివరించాలని సిబ్బందికి సూచించారు.

ర్యాలీలు, క్విజ్, వ్యాసరచన, పెయింటింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించి.. ఫొటోలు, పత్రికా ప్రకటనలు, ఆయుష్మాన్ భారత్ పోర్టల్‌లో తేదీల వారీగా అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జీవరాజు, ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిరోష, డిప్యూటీ డీఈఎంవో శ్రీనివాసులు, వైద్యాధికారులు రేణు కు మార్, జయరాం, సూపరింటెండెంట్లు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న వికారాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రయాదవ్

ఎన్‌సీడీని పకడ్బందీగా చేపట్టాలి

వికారాబాద్ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రయాదవ్

పెద్దేముల్, అక్టోబర్ 21 : గ్రామాల్లో ఎన్‌సీడీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని వికారాబాద్ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రయాదవ్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్ సెంటర్ల నిర్వహణ ఎలా ఉన్నది..? అన్ని ప్రాంతాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు వస్తున్నారా..? ఓపీలో టెస్టులు చేస్తున్నారా..? అన్ని రకాల రికార్డులను అప్‌డేట్ చేస్తున్నారా..? వెయింగ్ మిషన్లు అందరికీ పంపిణీ చేశారా..? అని సిబ్బందితో ఆరా తీశారు. అన్ని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో ఎన్‌సీడీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని.. ప్రోగ్రాం సక్రమంగా జరుగుతున్నదా..? లేదా..? క్షేత్రస్థాయిలో మెడికల్ ఆఫీసర్ తనిఖీ చేయాలని డాక్టర్ వెంకట్ సాయికి సూచించారు. గాజీపూర్ సబ్ సెంటర్ మూతపడకుండా చూడాలని, అన్ని సబ్ సెంటర్లు సక్రమంగా కొనసాగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫార్మసీలో గడువు దాటిన మందులు నిల్వ ఉండకుండా చూడాలని.. సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలన్నారు. ఎంపీహెచ్ఏ అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో వెంటనే మెమో జారీచేయాలని, అదేవిధంగా జిల్లా వైద్యాధికారికి లిఖితపూర్వకంగా సమాచారం ఇవ్వాలని సీనియర్ అసిస్టెంట్‌ను ఫోన్‌లో ఆదేశించారు. ఈ నెల 5న నాగులపల్లి సబ్‌సెంటర్ పరిధిలో చనిపోయిన నర్సాపూర్ గ్రామానికి చెందిన బాలింత వైష్ణవికి సంబంధించి అన్ని వివరాలను సేకరించి, విచారణ చేపట్టాలని ఎంపీహెచ్‌ఏ ను ఆదేశించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకట్ సాయి, ఫార్మాసిస్ట్ పల్లవి,ఎంఎల్‌టీ సంతోష్, డాక్టర్ ప్రమోద్ పాల్గొన్నారు.



స్పీకర్‌ను కలిసిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సోమవారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు కమిషన్ సభ్యుడు సురేందర్, వికారాబాద్ డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్ ఉన్నారు.

-వికారాబాద్, అక్టోబర్ 21